# ఎక్కవలసిన రైలు

## – సత్యం మందపాటి



"సాహితీ సిరికోన" వారి ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ జొన్నలగడ్డ రాంభొట్లు- సరోజమ్మ స్మారక పురస్కారం" బహుమతి అందుకున్న నవల.

*(గత సంచిక తరువాయి)*

మర్నాడక్కడ వున్నంతవరకూ సమీర తన మిత్రుల గురించీ, ఒక్కొక్కళ్ళూ ఎలాటివారో, వారి స్నేహాన్ని ఎందుకు వదిలేసుకుందో చెబుతూనే వుంది.

జెస్సికా మౌనంగా విన్నదే కానీ ఏమీ అనలేదు.

ఆ మధ్యాహ్నం సమీరని ఎయిర్పోర్టులో దించారు బాబ్, జెస్సికా.

“ఇదిగో నాకజిన్ నిక్ ఫోన్ నెంబర్, అక్కడ నిన్ను రిసీవ్ చేసుకుంటాడు. ఎయిర్ పోర్టులో దిగి, నువ్వు లగేజ్ తీసుకుని బయటకు రాగానే, సమీర అని పేరు వ్రాసిన ఒక అట్టముక్క పట్టుకుని నుంచుని వుంటాడుట. ఏమీ భయం లేదు” అన్నాడు బాబ్.

బాబ్ అన్ని జాగ్రతలు తీసుకుని చెబుతుంటే, సమీరకి రోజుకి ఎన్నోసార్లు జాగ్రత్త, జాగ్రత్త అని చెప్పే తన నాన్న ప్రసాద్ గుర్తుకి వచ్చాడు.

ఆమె పెదిమల మీద చిరునవ్వు దానంతట అదే బయటకు వచ్చింది.

“మెనీ మెనీ థాంక్స్” అన్నది నవ్వుతూ.

జెస్సీ కూడా నవ్వి, “జాగ్రత్త సమీ” అన్నది.

ఇద్దరికీ చెరో కౌగలింత ఇచ్చి లోపలికి వెళ్ళింది సమీర.

సమీర కిటికీ దగ్గర వున్న సీటులో కూర్చుని, తన ఫోన్లో మెసేజీలు చూస్తూ కూర్చున్నది.

విమానం తలుపు ఇక మూసేస్తారనుకునే సమయంలో హడావిడిగా వచ్చి సమీర పక్కనే ఖాళీగా వున్న సీటులో కూర్చున్నాడు అతను.

సీటుబెల్ట్ పెట్టుకుని సర్దుకుని కూర్చున్నాక, సమీర వేపు చూసి "సారీ! ఆలస్యంగా వచ్చాను. నా కనెక్టింగ్ ప్లేన్ వచ్చేసరికి ఆలస్యమయింది" అన్నాడు.

అతను కూడా భారతీయుడిలాగానే వున్నాడు.

సమీర పలకరింపుగా నవ్వింది.

"నా పేరు అశోక్. అశోక్ ముఖోపాధ్యాయ. మిత్రులు కొంతమంది ముక్కూ అని కూడా అంటారు" అన్నాడు.

సమీరకి నవ్వు వచ్చిందిగానీ సభ్యత కాదని నవ్వు ఆపుకుంటూ, "నా పేరు సమీర" అంది.

అతను చిన్నగా నవ్వి, తను కూడా ఫోన్లో మెసేజీలు చదువుకుంటూ కూర్చున్నాడు.

ఈలోగా ప్లేన్ బయల్దేరుతుంటే ఇద్దరూ సెల్ఫోన్లు మూసేసి కిటికీలోనించీ బయటకు చూస్తూ కూర్చున్నారు.

"మీరు ఇండియానించీ వస్తున్నారా?" అడిగాడు అశోక్ ఇంగ్లీషులో.

"లేదు. అమెరికానుంచి. చికాగో మా వూరు" అంది సమీర.

"నేను ఇండియాలో కలకత్తానించీ వస్తున్నాను. బర్మింగ్హాంలో యూనివర్సిటీలో రీసెర్చి ఫెలోషిప్ వస్తే, అక్కడికి వెడుతున్నాను" అన్నాడు అశోక్.

సమీర ఆశ్చర్యంగా చూసింది.

"నేనూ అక్కడికే. మైక్రో బయాలజీలో ఫెలోషిప్ వచ్చింది" అంది.

అతనూ ఆశ్చర్యపోయాడు.

"ఇలా మనం కలవటం గమ్మత్తుగా వుందే! నేను కల్చరల్ ఆంథ్రొపాలజీలో పీహెచ్డీ చేశాను. అది వీళ్ళకి నచ్చింది. అదే విషయం మీద రీసెర్చి చేయమని ఒక సంవత్సరం ఫెలోషిప్ ఇచ్చారు" అన్నాడు.

"బాగుంది. ఆయితే మనం ఇకనించీ రోజూ చాలాసార్లు కలుస్తామన్నమాట" అంది సమీర.

"అవును. నైస్ మీటింగ్ యు" అన్నాడు అశోక్.

కలకత్తానించీ వస్తున్నాడు కనుక, జెట్లాగ్ వల్ల కాసేపట్లోనే సీటులో వెనక్కి ఆనుకుని నిద్ర పోయాడు అశోక్.

సమీర కూడా సీటులో వెనక్కి ఆనుకుని కళ్ళు మూసుకుంది.

ం ం ం

సమీరని ఎయిర్పోర్టులో దించి కారులో ఇంటికి వెడుతున్నప్పుడు అన్నది జెస్సికా "సమీరలో ఇంకా ఏమీ మార్పు లేదు. అలాగే వుంది" అని.

కారు డ్రైవ్ చేస్తున్న బాబ్ అన్నాడు, “ఏం, చక్కగా సన్నగా పొడుగ్గా అందంగా బాగుంది కదా. ఇంకా ఏం కావాలి?”

“నేను చెప్పేది అదికాదు. మనస్థత్వంలో ఏమీ మార్పులేదని. ఎలిమెంటరీ స్కూలునించీ ఇప్పటిదాకా చూస్తున్నాను కదా, ఆమెది అదొక రకం సైకాలజీ. తన చుట్టూ వున్న మిత్రులతో సహా మిగతా వాళ్ళందరూ ఏ లోపాలు లేకుండా పర్ఫెక్టుగా వుండాలి, అలాటి వారితోనే స్నేహం చేయలి అనుకుంటుంది. కానీ తనలా వుండదు. ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు, వాళ్ళు మాట్లాడేది అసలు వినకుండా తన మాటలే వాళ్ళు వినాలనుకుంటుంది. అందువల్ల సంభాషణ సవ్యంగా ముందుకు వెళ్ళే అవకాశం వుండదు. పైగా ఎవరు ఏది చెబుతున్నా, మాటిమాటికీ వాటిలో తప్పులు పట్టి తన ఆలోచనలే వాళ్ళ మాటలుగా ఇరికిస్తుంటుంది. ఎవరి భాషా, సంభాషణల తీరు, అభిప్రాయాలు వాళ్ళవే అనీ, వాటిని తను గౌరవించాలనీ గ్రహించదు. అలా లేనివారితో వివాదాలు పెంచుకుంటుంది. అందువల్ల ఎంతోమంది మంచి స్నేహితులని కోల్పోయింది”

“నిన్నా ఇవాళా మీరిద్దరూ మాట్లాడుకుంటుంటే వింటున్నాను. ఆమె వైఖరి చూస్తూనే వున్నాను. అదీకాక తన మాటలనే ఎదుటివారి మాటలుగా వూహించుకుని మాట్లాడుతుంది. అమె ఏది అడిగినా మనం జవాబులు ఇచ్చాక, ఆమె కోరుకుంటున్న జవాబులిస్తేనే ఆవిడ సంతోషంగా వుంటుంది. నేను అది కూడా గమనించాను. అలాటి వారితో సంభాషణ చేయటం కష్టమే” అన్నాడు బాబ్.

“ఇంకో విషయం తెలుసా? సమీకి నేనొక్కదాన్నే ఇన్నేళ్ళుగా గాఢ స్నేహితురాలిని. మిగతా అందరితో అవసరానికి మించి స్నేహం చెయ్యకపోగా, ఏవో వంకలు పెట్టి అన్ని స్నేహాలకూ ఎప్పటికప్పుడు గుడ్ బై చెప్పేస్తుంది. నది దాటగానే బోటు తగలేసుకుంటుంది”

“మరి మైక్రోబాయాలజీలో పీహెచ్డీ చేసింది, ఆ రంగంలో ఎన్నో పేపర్లు పబ్లిష్ చేసింది, ఎంతో పేరు తెచ్చుకుంది... ఇలాటి వ్యక్తిత్వంతో అదెలా సాధ్యం?” అడిగాడు బాబ్.

“అదే నాకూ అర్థం కాదు. మంచి తెలివితేటలు వున్న అమ్మాయి సమీర. కానీ ఒక్కొక్కప్పుడు నాతో మాట్లాడుతుంటే ఎంత అమాయకపు పిల్లో సమీర అనిపిస్తుంది. ఇప్పటికి మూడు నాలుగు చోట్ల తన మేనేజర్ నచ్చకా, సహోద్యోగులు నచ్చకా ఉద్యోగాలు మారినా, మైక్రో బయాలజీ రీసెర్చిలో మాత్రం చాల మంచి పేరు సంపాదించింది”

“మరి నీకు ఆమె మంచి స్నేహితురాలు కదా. నువ్వు ఆమెకి చెప్పి సరిదిద్దవచ్చునే” అన్నాడు బాబ్.

జెస్సికా అంది “అవును. చెప్పవచ్చు, కానీ చెప్పలేదు. ఇందులో నా స్వార్థం కూడా వుంది. నాకు అక్కచెల్లెళ్ళు లేకపోవటంతో చిన్నప్పటినించీ నేనూ, సమీరా అక్కచెల్లెళ్లలాగానే పెరిగాం. మా కాలేజీలో కూడా మమ్మల్నిద్దరినీ

ఐడెంటికల్ ట్విన్స్ అని హేళన చేసేవారు. అంత మంచి స్నేహం దెబ్బ తినటం నాకు ఇష్టంలేదు. అందుకే అప్పుడప్పుడూ నేను సూచన ప్రాయంగా చెప్పినా, ఒక పరిధి దాటి ఎన్నడూ వెళ్ళలేదు" అంది జెస్సికా.

బాబ్ మాట్లాడలేదు. ట్రాఫిక్ ఎక్కువగా వుందేమో, రోడ్డు వేపే చూస్తూ డ్రైవ్ చేస్తున్నాడు.

ఒక్క క్షణం ఆగి అంది జెస్సికా. "సమీర వారంరోజుల్లో పెళ్ళి చేసుకోవటంలోనే కాదు, విడాకుల్లో కూడా తొందరపడిందేమో అనిపించింది. ఇంకా కొంత సమయం తీసుకుంటే బాగుండేది అనిపించింది" అని,

తనతో సమీర తన పెళ్ళి గురించి చెప్పిన విషయాలన్నీ చెప్పింది.

"ఇక్కడ నాకు అర్థం కాని విషయం ఒకటి వున్నది. నువ్వు కొత్త డ్రస్ కొనుక్కోవాలన్నా, కొత్త చెప్పులు కొనుక్కోవాలన్నా, రెండు మూడు నాలుగు వారాలపాటు పదహారు షాపులు తిరిగీ తిరిగీ, ఇటు గూగూలమ్మనీ, అటు అమెజానయ్యనీ అడిగి, ఎంతో రీసెర్చి చేసిన తర్వాతగానీ కొనుక్కోవు కదా. అలాగే నేను కూడా కొత్త లాప్టాపు కొనాలనుకున్నా, మనకి టీవీ కొనాలనుకున్నా వాటి టెక్నాలజీ ఎప్పటిది, ఎలా పనిచేస్తాయి, ఫీచర్స్ ఏమిటి, వారంటీ ఎంత, ధర ఎంత అంటూ ఎంతో సమయం తీసుకుని ఆలోచించిన తర్వాతే కదా కొంటాం. అలాటిది వారం రోజుల్లో ఇలా చూసి, అలా పెళ్ళిళ్ళు ఎలా చేసుకుంటారో తెలీదు. లాప్టాపో, టీవీనో, ఇంకోటో అయితే, నచ్చకపోతే తిరిగి ఇచ్చేయవచ్చు. కానీ పెళ్ళి అలా కాదే!" అన్నాడు బాబ్.

"అది మంచా, చెడా అన్నది నువ్వూ నేనూ నిర్ణయించేది కాదు బాబీ. అది ఆ సంస్కృతిపరంగానూ, వ్యక్తిపరంగానూ కొందరికి సమ్మతం, కొందరికి కాదు. అంతే!" అన్నది జెస్సికా.

"కానీ సమీర ఇక్కడి సంస్కృతిలో పుట్టి పెరిగిన అమ్మాయి కదా! సమీర ఇక్కడే పుట్టి పెరగటం వల్ల నీలాగా, నాలాగా పూర్తిగా అమెరికన్ అయిపోయింది. ఆమెకి ఇండియన్ సంస్కృతి గురించి కొంచెం తెలిసినా, రోజువారీ జీవితంలో అదెలా వుంటుందో అసలు అవగాహన లేదు. అలాగే మధు. అమెరికాలో కొత్తగా అడుగు పెట్టిన వ్యక్తి. అమెరికన్ కల్చర్ ఏమాత్రం తెలియని వ్యక్తి. ఇద్దరూ రెండు రైలు పట్టాలవంటి వారు. సమాంతరంగా వెడుతుంటారు. అలాటిది మరి ఇద్దరూ ఒకే విధంగా వుండాలంటే చాల సమయం పడుతుంది. ఇలాటి విషయాల్లో ఎంతో సహనం కావాలి. మరెందుకు అంత తొందర పడిందో!" అన్నాడు బాబ్ సాలోచనగా.

"మన నిక్ సైకాలజిస్ట్ కదా. అతను సహాయం చేయగలడేమో.." అంది జెస్సికా.

"చేయగలడు. అతని వృత్తే అది. సైకాలజీలో పీహెచ్డి చేసి, ఆరేళ్ళనించీ కాలిఫోర్నియాలో కౌన్సెలింగ్ సైకాలజిస్టుగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. కానీ సమీర ఆ కౌన్సెలింగుకి ఒప్పుకోవాలి కదా. నిక్ ఇక్కడ ఇంగ్లాండులో తన 'జీవన పరమావధి సత్యాన్వేషణ' ఎప్పుడు ఆపేసి మళ్ళీ సైకాలజీలో పడతాడో ఎవరికి తెలుసు" అన్నాడు బాబ్.

“లేదు. నాతో ఒకసారి అన్నాడు. అక్కడ తనకి వృత్తిపరంగా తృప్తిగానే వున్నా, కొన్నాళ్ళు కొంత విశ్రాంతి తీసుకుని, ఒంటరిగా ఎక్కడికైనా వెళ్ళాలి అనుకున్నాడుట. తన ఇష్టాల ప్రకారం ఇంగ్లాండ్ అయితే బాగుంటుందని నిర్ణయించుకున్నాడుట. అందుకే మొత్తం రెండు నెలలు ఇంగ్లాండులో వుండి వెళ్ళిపోతానని అన్నాడు. ఇప్పుడు దాదాపు ఒక నెల అయింది కదా. ఇంకొక నెల. ఈలోగా నిక్ అక్కడ బర్మింగ్హాంలో సమీరని కలుస్తాడుగా, చూద్దాం” అంది జెస్సికా.

4

“మీరు కాసేపు పడుకుంటారా?” రాజేశ్వరినీ, రేఖనీ అడిగింది వీణ.

“లేదు. ఇప్పుడు సుమ లేచే సమయం అయింది. దానికి పాలు పట్టాలి, నేను బెడ్రూంలోకి వెడతాను” అంది రేఖ, సుమని ఎత్తుకుని బెడ్రూం వేపు వెళుతూ.

“రేఖా, అక్కడే టవల్స్, దుప్పట్లు పెట్టానమ్మా. ఇంకేదన్నా కావాలంటే అడుగు” అంది వీణ.

“నాకు నిద్ర పట్టటం మానేసి చాల రోజులు అయింది. ఇప్పుడే కాదు రాత్రిళ్ళు కూడా నిద్ర పట్టదు. అసలేం జరిగిందో మీకు అంతా చేప్పేదాకా నా భారం తీరదు. చెప్పనా?” అన్నది రాజేశ్వరి.

వీణకీ తెలుసుకోవాలనే వుంది కానీ, సభ్యత అడ్డు వస్తుంటే అడగలేదు.

ఇప్పుడు రాజేశ్వరి తనే చెబుతానంటున్నది కనుక, “చెప్పండి. అసలెందుకిలా అయింది?” అని అడిగింది.

“నాదీ, మా ఆయనదీ ఇద్దరిదీ గుంటూరే. మాకు ఒకే ఒక అమ్మాయి రేఖ. రెండేళ్ళ పైనే అయింది. ఎవరో తెలిసిన వాళ్ళు మంచి అమెరికా సంబంధం వుంది, చాల మంచి కుటుంబం అని చెప్పారు. అప్పటికే మా అమ్మాయి చదువు పూర్తి చేసుకుని సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నది. పెళ్ళి కూడా చేస్తే బాగుంటుంది అనుకుంటున్నాం కనుక, సరే చూస్తాం అన్నాము. వాసు, అతని అమ్మ, నాన్న అప్పటికి ఇంకో పదిహేను రోజుల్లో ఇండియా ప్రయాణం పూర్తి చేసుకుని అమెరికాకి తిరిగి వెళ్ళబోతున్నారు కనుక మర్నాడే పెళ్ళిచూపులు జరిగాయి. వాసు అమెరికాలోనే పుట్టి పెరిగాడు. అతను ఎక్కువగా మాట్లాడకపోయినా, మంచి అబ్బాయిలానే కనపడ్డాడు. అతని అమ్మా, నాన్నా కూడా చాల మర్యాద ఇచ్చి మాట్లాడటం, రేఖ మాకు నచ్చింది పెళ్ళి వెంటనే జరిపించమని అడగటం, రేఖ కూడా ఈ పెళ్ళికి ఒప్పుకోవటం.. అన్నీ హడావిడిగా జరిగిపోయాయి. ఇంకో పది రోజుల్లో మంచి పెళ్ళి ముహూర్తం వుంది అంటే, అదీ ఖాయం చేసుకున్నాము. దాని తర్వాత అన్నీ చకచకా జరిగిపోయాయి. వాసు వాళ్ళు అమెరికా వెళ్ళిపోయి అవసరమైన పేపర్ వర్క్ అంతా పూర్తిచేసి పంపించటం, మేము రేఖకి పాస్పోర్ట్, వీసా తీసుకోవటం కూడా చాల తొందరగా జరిగిపోయింది. నెల రోజుల్లో రేఖ ఒక్కత్తే అమెరికా వెళ్ళిపోయింది” చెప్పటం ఆపింది రాజేశ్వరి.

వేణు కూడా అక్కడే కూర్చుని వింటున్నాడు. అప్పుడే పాపాయిని తీసుకు వచ్చింది రేఖ.

కడుపునిండిందేమో పదిరోజుల పసిపాప ఆ బుల్లి నోటి మీద, తన బుల్లి చేయి వేసి రుద్దుకుంటూ ఒక చిరునవ్వు ఇచ్చింది.

“తాతను చూసి పలకరింపు నవ్వు నవ్వేసింది” అన్నది వీణ, పాపాయిని తన చేతుల్లోకి తీసుకుంటూ.

“అందరు పిల్లలూ ఏడుస్తూ పుడతారు కదా. సుమ పుట్టడమే నవ్వుతూ పుట్టింది” అన్నది రాజేశ్వరి.

“అంకుల్, నా ఫోన్లో మన కేసుకి ఎంతో వుపయోగపడే అవసరమైన సమాచారం వుంది. దాంట్లోనించీ సిమ్ కార్డు తీసేస్తాను. వైర్లెస్ కూడా ఆపేస్తాను. అప్పుడు నేనెక్కడ వున్నానో అతనికి తెలిసే అవకాశం లేదు. నా దగ్గర ఇంకొక స్పేర్ ఫోన్ వుంది. దాంట్లో కొత్త సిమ్ కార్డు వేయిద్దాం. అది నేను వాడుకుంటాను. మనం ఇప్పుడే వెళ్ళి ఆ పనులు పూర్తిచేసుకువద్దామా?” అడిగింది రేఖ.

రేఖ ధైర్యవంతురాలే కాదు. బాగా తెలివైంది కూడాను అనుకున్నాడు వేణు.

వీణతో “నేను వచ్చేదాకా జరిగిన అసలు కథ చెప్పకండి. సశేషంలో పెట్టండి. నేనూ వినాలి కదా ఏం జరిగిందో, ఎలా జరిగిందో” అంటూ లేచాడు వేణు.

కారులో వెడుతున్నప్పుడు అడిగాడు వేణు. “నువ్వు ఉద్యోగం చేస్తున్నావా? నాకు ప్రకాష్ నీ వివరాలేమీ చెప్పలేదు. అతనికి కూడా అంతా తెలిసి వుండకపోవచ్చు”

“అవునంకుల్. నేను ఎబి కార్పొరేషన్లో సాఫ్ట్వేర్ డెవెలప్మెంట్ గ్రూపులో ఇక్కడికి వచ్చినప్పటినించీ, అంటే రెండేళ్ళకు కొంచెం తక్కువగా, దాదాపు ఇరవై రెండు నెలలుగా పని చేస్తున్నాను. మా కంపెనీ వాళ్ళకి బాగా పని చేస్తానని నేనంటే ఇష్టం కూడాను”

“అయితే నీకు ఆర్థికంగా ఫరవాలేదా? ఇకనించీ నీ కాళ్ళ మీద నువ్వు నిలబడగలవా?”

“మొదటి ప్రశ్నకి జవాబు చెప్పాలంటే, లేదు. నా జీతం మా జాయంట్ ఎకౌంటులో వేస్తుండే వాళ్ళు. డబ్బంతా అక్కడే వుంది. నాకు అదేదీ అందుబాటులో లేకుండా చేశాడు. నా ఎటీఎం కార్డు అతని దగ్గరే వుంది. మా ఎకౌంట్ నించీ ఇవాళ డబ్బులు తీసుకోవటం కష్టం. బాంక్ ఎకౌంట్ నెంబరు మొదలైన వివరాలన్నీ అతని దగ్గరే వున్నాయి. మా బాంకుకి వెళ్ళి నా పేరు చెప్పి డబ్బులు తీసుకోవచ్చేమోగానీ, ఇవాళ ఆదివారం బాంకుకి శెలవు. నేను రేపు ప్రొద్దున్నేఆ బాంకులో డబ్బులు తీసేసుకోవాలి. వేరే బాంక్ ఎకౌంట్ ఓపెన్ చేసి, అక్కడికే డైరెక్ట్ డిపాజిట్ మార్పించాలి. అంతేకాదు నేను కొనుక్కున్న కారు కూడా తన పేరు మీదే పెట్టించుకున్నాడు. నా నెల జీతంలోనించే ఆ కారు పేమెంట్లు తీసుకుంటున్నారు. నాకు ఇప్పుడు కారూ లేదు. నా పెళ్ళి నగలు, మిగతా నగలూ అన్నీ కూడా వాసు ఇంట్లో తన సేఫులో దాచేశాడు”

నిర్ఘాంతపోయాడు వేణు. “అంత దుర్మార్గుడా! ఏమిటి అతని ఉద్దేశ్యం?” అన్నాడు వేణు.

"అదే తెలిస్తే ఈ కథ ఇంతదాకా వచ్చేదే కాదు. మీ రెండవ ప్రశ్నకు జవాబు. అవును, నా కాళ్ళ మీద నేను నిలబడగలను అనే నమ్మకం, ఆత్మ విశ్వాసం నాకు వున్నాయి. నా జీవితాన్ని నాకు సంతోషం, తృప్తి కలిగించేలా చేసుకోగలను" అంది రేఖ.

వేణు ఆమె మాటలు విని, "రేఖ వయసులో ఇంకా చిన్నపిల్లే అయినా మానసికంగా ఎంతో ఎదిగిపోయింది" అనుకున్నాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments